క్లుప్తంగా

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మధురపూడి: కోరుకొండ మండలం జంబూపట్నం గ్రామంలో శనివారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరంతా రోడ్డుపైనే నిలిచిపోతుంది. దీంతో కోరుకొండ సెంటర్ నుంచి ప్రభుత్వ హాస్పిటల్ రోడ్డు, పాత జంబూపట్నం, కొత్త జంబూపట్నంలోని మురుగునీటి కాలువలను శుభ్రం చేశారు. సచివాలయం సెక్రటరీ మదర్ బీబీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. మెయిన్ రోడ్డులోని డ్రైనేజీల్లో చెత్తా చెదారాన్ని బయటకు తీశామన్నారు.

17న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో ఈ నెల 17న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జి.రవీంద్రారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆర్‌ఆర్‌ఆయుర్వేద ఆస్పత్రి ప్రాంగణంలో శిబిరం జరుగుతుందన్నారు. మోకాళ్ల నొప్పులు, నరాల బలహీనత, దీర్ఘకాలిక సమస్యలున్న వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


చంద్రేడులో వేంకటేశ్వరస్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వెంకన్నకు పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామివారు

పెదపూడి: మండలంలోని సంపర గ్రామంలో నిత్య పూజలందుకుంటున్న ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తమి శనివారం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి తులసి పూజ నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు


సమావేశంలో పాల్గొన్న మండల అధికారులు

సీతానగరం: సీజనల్ వ్యాధుల నియంత్రణకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అధికారులతో సీజనల్ వ్యాధులు – నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య మాట్లాడుతూ సురక్షిత తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వలు లేకుండా చూడడం వల్ల వ్యాధులు వచ్చే అవకాశం ఉండదన్నారు. నిల్వ ఆహారం తీసుకోకూడదని, డ్రైడే పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సర్వేశ్వరమూర్తి, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు, డాక్టర్ మేఘన, డాక్టర్ ఏసురాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అవినాష్, ఏపీవో నాగేశ్వేణి పాల్గొన్నారు.

నూతన రోడ్డు నిర్మించాలి


ద్విచక్ర వాహనం బురదలో కూరుకుపోయి పడిపోయిన వాహనదారులు

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ జగనన్న లేవుట్-1లో ఇటీవల కురిసిన వర్షాలకు గ్రావెల్ రోడ్డు దెబ్బతిందని, సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా సీసీ రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు. లేఅవుట్‌లో ఉన్న గ్రావెల్ రోడ్డు వర్షాలకు బురదమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు చెబుతున్నారు. తమ కాలనీలో 500 మందికి పైగా నివసిస్తున్నారని, అధికారులు తమ సమస్యకు పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.

అమ్మో జ్వరం.. జరభద్రం

- అపరిశుభ్రతే సీజనల్ వ్యాధులకు మూలం
- ప్రాణాంతక జ్వరాలకు దోమలే కారణం


సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు

రంగంపేట: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలు, ఇతర రోగాలు విజృంభిస్తున్న తరుణంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాంతక పరిస్థితులు తలెత్తే ప్రమాదముంది. రంగంపేట మండలంలో 19 గ్రామ సచివాలయాల పరిధిలో సుమారు 60 వేల మంది జనాభా నివసిస్తున్నారు. మండల కేంద్రమైన రంగంపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు అస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు చేరుతుంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశముంది. రోగాలు వచ్చాక బాధపడటం కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలావరకూ వ్యాధులను నియంత్రించవచ్చని చెబుతున్నారు.

ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణం. వీటి వల్ల డెంగీ, మలేరియా, బోధ, మెదడు వాపు వంటి వ్యాధులు ప్రబలుతాయి. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా, నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి వ్యాధులు విజృంభించే అవకాశముంది.

డెంగీ జ్వరం

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం తగ్గినట్టు తగ్గి వారం పది రోజులు ఉంటుంది. ఎడీస్ దోమ వల్ల వచ్చే ఈ జ్వరం ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కళ్ల నొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం ఈ జ్వరం లక్షణాలు. అలాగే ముక్కు, మలం ద్వారా రక్తం వచ్చే అవకాశం ఉంటుంది.

మలేరియా

తీవ్రమైన జ్వరం, చలితో వణుకు ప్రారంభమై నెలల తరబడి బాధిస్తుంది. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి వర్షాకాలంలో అధికంగా వస్తుంది. నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కనీస జాగ్రత్తలు

- వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు తాగాలి.
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను శుభ్రపరిచి క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలి.
- భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి చుటుపక్కల ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- మురుగు నీటి ప్రాంతాల్లో లార్వాను నాశనం చేయాలి.
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలి.

సేవలు వినియోగించుకోండి



జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిద్ధం చేశాం. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– బి.వేణుశ్రీలక్ష్మి, మండల వైద్యాధికారి, రంగంపేట

అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలం నేపథ్యంలో సచివాలయ సిబ్బందికి, ఎంఎల్‌హెచ్‌పీలకు, ఏఎన్‌ఎంలతో సమావేశం ఏర్పాటు చేసి సీజన్ వ్యాధులపై సూచనలు ఇచ్చాం. గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నాం.

– కె.జయమణి, సీహెచ్‌ఓ, పీహెచ్‌సీ, రంగంపేట

సమాజానికి సేవ చేయడమే ప్రధాన ధ్యేయం


సమావేశంలో పాల్గొన్న రాజమండ్రి రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

రాజానగరం: సమాజానికి ఉపయోగపడేలా సేవలు చేయాలన్నదే రాజమండ్రి రౌండ్ టేబుల్ సంస్థ సంకల్పమని పబ్లిక్ రిలేషన్స్ కన్వీనర్ వల్లూరి సత్యశ్రీరామ్ అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల సమీపంలోని హబిటేట్ హోటల్‌లో రాజమండ్రి రౌండ్ టేబుల్ –381 టేబ్లింగ్ 2024–25 తొలి సమావేశం శనివారం జరిగింది. రాజమహేంద్రవరం, పరిసరాలలోని 40 ఏళ్లలోపు యువ పారిశ్రామికవేత్తలు, వైద్యులు, విద్యావేత్తలు, 18 ఏళ్ల యువకులు (టేబ్లర్స్) కలిసి ఈ సంస్థ ద్వారా సమాజ హితమైన అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. చింతూరు ప్రభుత్వాస్పత్రిలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి, 200 మంది రోగులను గుర్తించి, వారికి జీఎస్ఎల్ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో చికిత్స చేయించామన్నారు. ఫ్రీడమ్ త్రూ ఎడ్యుకేషన్ అనే కార్యక్రమం ద్వారా వివిధ ప్రాంతాలలో ఇంతవరకూ 8,665 తరగతి గదులు నిర్మించామన్నారు. అనంతరం నూతన పాలక వర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చింతలపాటి శ్రీనివాసరాజు, వైస్ చైర్మన్‌గా డాక్టర్ గన్ని సందీప్, కోశాధికారులుగా డాక్టర్ గోగినేని తరుణ్‌చౌదరి, మేకా సతీష్ ఎన్నికయ్యారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


కానూరి దివ్యశ్రీ


డి.యశో విజయశ్రీ


మేడా సాత్విక్

బిక్కవోలు: మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ–2 కె.పూర్ణచంద్రరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పందలపాక శ్రీపడాల పెద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన కానూరి దివ్యశ్రీ నూజివీడు ట్రిపుల్ ఐటీకి, బలభద్రపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన దార్వంపూడి యశో విజయశ్రీ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారన్నారు. పందలపాకలో విద్యార్థిని దివ్యశ్రీని పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ గొలుగూరి నాగిరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, పాఠశాల హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి అభినందించారు.

సాత్విక్ ఎంపిక

రాజానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మేడా సాత్విక్ న్యూజివీడులోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్‌ఎం పి.నాగమణి తెలిపారు. అతడు 10వ తరగతిలో 568 మార్కులతో సాధించాడన్నారు. విద్యా కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ మూడేళ్ల తమ స్కూలు విద్యార్థులు ఏటా ట్రిపుల్ ఐటీ, ఏపీఆర్ జేసీలలో సీట్లు పొందడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల కృషిని, ఆయా విద్యార్థులను అభినందించారు.

పోస్టల్ బీమాతో కుటుంబానికి రక్షణ


పాలసీదారుని కుటుంబానికి ప్రమాద బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: నేడు ప్రతి ఒక్కరికీ బీమా ఉండాలని, అదే ఆ కుటుంబానికి ఎంతో ధీమానిస్తుందని రాజమండ్రి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ శేషారావు అన్నారు. రాజమండ్రి తపాలా డివిజన్, ఇండియా పోస్టు చెల్లింపుల బ్యాంకు సమన్వయంతో స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల సమావేశపు హాలులో శనివారం గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ (జీఏజీ) గ్యాగ్ పాలసీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇండియా పోస్టు చెల్లింపుల బ్యాంకు వివిధ బహుళజాతి బీమా సంస్థల భాగస్వామ్యంతో రూ.555 వార్షిక ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాద బీమా పాలసీని అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇదే గత ఏడాదిలో రూ.399 ప్రీమియంతో లభించేదన్నారు. ఈ పాలసీలు తీసుకున్న కలవచర్లకు చెందిన పసుమర్తి రామకృష్ణ, రాజమహేంద్రవరానికి చెందిన బావిశెట్టి నారాయణరావు మృతి చెందడంతో వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల ప్రమాద బీమా చెక్కులను జీఎస్ఎల్ సూపరింటెండెంట్ డాక్టర్ టీవీఎస్‌పీ మూర్తి, అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.హరిబాబు చేతుల మీదుగా అందజేశారు. తపాలా శాఖ అందజేస్తున్న వివిధ రకాల సేవలను వివరించారు.

సేవా హృదయం..అందరికీ ఆదర్శం


నాగేశ్వరరావును సత్కరిస్తున్న అప్పటి కలెక్టర్ మాధవీలత (ఫైల్)

కంబాలచెరువు: సేవా కార్యక్రమాలు చేయడానికి స్థిరమైన సంకల్పం ఉండాలి. చిత్తశుద్ధితో, పట్టుదలతో పనిచేసే వ్యక్తిత్వం ఉండాలి. మానవసేవ మాధవసేవ అని భావించాలి. ఇలాంటి లక్షణాలతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆదిత్య నాగేశ్వరరావు, రాజమహేంద్రవరంలో ఏ సేవా కార్యక్రమం జరిగినా ఆయన ముందుంటారు. అసలు పేరు డాక్టర్ జీవీఎస్. నాగేశ్వరరావు. ఆదిత్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా, యూత్ రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. ఈయన ఇప్పటి వరకూ 62 సార్లు రక్తదానం చేశారు. ఆ సేవే ఆయనను అందరికీ సుపరిచితం చేసింది. ఆలిండియా ఇందిరాగాంధీ జాతీయ సేవా పథకం అవార్డుల్లో రాష్ట్రంలో బెస్ట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా నిలిచారు.

రాష్ట్రస్థాయిలో పేరు ప్రఖ్యాతలు

నాగేశ్వరరావు ఆర్ట్స్ కళాశాలలో ఎంకాం పూర్తి చేసి, ప్రైవేట్ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. 2003లో ఆదిత్య డిగ్రీ కళాశాల డైరెక్టర్ ఎస్పీ.గంగిరెడ్డి ప్రోత్సాహంతో ఆ కళాశాలలో చేరారు. ఎన్ఎస్ఎస్ సేవలను చిత్తశుద్ధితో చేస్తూ నేడు రాష్ట్రస్థాయిలోనే పేరు పొందారు. పుష్కరాల సమయంలో ఆయన ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అనేక సేవలు అందించారు. సెంట్రల్ జైలులో కార్యక్రమాలు, మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, ఎయిడ్స్ రోగులకు మందుల పంపిణీ తదితర సేవలు కొనసాగిస్తున్నారు.

రక్తదానంలో ఆదర్శప్రాయుడు

రక్తదానం చేయాలంటే చాలా మంది భయపడతారు. అటువంటి వారికి రక్తదానంపై అవగాహన కల్పించి వారిని ముందుకు నడపతున్నారు.నాగేశ్వరరావు ఇప్పటి వరకూ 62 సార్లు రక్తదానం చేశారు. పలువురికి అవగాహన కల్పించే, వారితో కూడా రక్తదానం చేయిస్తున్నారు. ఆ సేవలకు గాను ఎన్నో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు.

ఎంతో సంతృప్తి



నా ప్రాణం ఉన్నంత వరకూ సేవలు కొనసాగిస్తాను. రక్తదానం చేయడం అంటే మరొకరి ప్రాణం నిలపడమే. ఎన్నోసార్లు రక్తం ఇచ్చి చాలామందిని ఆదుకున్నాను. ఆ సమయంలో కలిగిన సంతృప్తి వెలకట్టలేనిది. నన్ను ప్రోత్సహిస్తున్న ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్లు సుగుణ, ఎస్పీ గంగిరెడ్డి, ప్రిన్సిపాళ్లు సీహెచ్ ఫణికుమార్, రహమాన్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు.

– డాక్టర్ జీవీఎస్.నాగేశ్వరరావు, ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్

18న వారాహి అమ్మవారికి చందనాభిషేకం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: గాడాల గ్రామంలోని మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో జరుగుతున్న వారాహి అమ్మవారి గుప్త నవరాత్రుల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి అమ్మవారికి 108 కేజీల చందనంతో అభిషేకం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు తెలిపారు. దానవాయిపేటలోని సంస్థ కార్యాలయంలో శనివారం ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వారాహి మాతను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయన్నారు. గాడాల పీఠంలో ఈ నెల నాలుగున ప్రారంభమైన ఉత్సవాలు 18వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా వారాహి అమ్మవారికి తమ పీఠంలోనే చందనాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. అభిషేకం చేసిన గంధాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేస్తామన్నారు. సింగంశెట్టి మహితోష్, మతల రమేష్, ధరణికోట దుర్గా వెంకట హేమావతి, సర్దార్ తిరుమల రాజు వెంకటరాజు, కృష్ణ పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024–25 సంవత్సరానికి రెండో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. ఆసక్తి కలవారు iti.ap.gov.in అను వెబ్‌సైట్‌లో ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకుని రశీదు పొందాలన్నారు. వారందరూ ఈ నెల 25 సాయంత్రం 5 గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఐటీఐలోనే రిజిస్ట్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.

20న ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికలు

రాజమహేంద్రవరం సిటీ: ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక వర్గ ఎన్నికలను ఈ నెల 20వ తేదీన ఎస్‌కేవీటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి వి.కృష్ణకాంత్ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ నామినేషన్లు ఉపసంహరణ అనంతరం ఒకటో నియోజకవర్గంలో 31 మంది, 3వ నియోజక వర్గంలో ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. పోటీలో ఉన్నవారికి ఎన్నికల గుర్తులు కేటాయించామని తెలిపారు. 20వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందన్నారు. ఒకటో నియోజక వర్గానికి సంబంధించి పోలింగ్‌ను రాజమహేంద్రవరంలోనూ, 3వ నియోజక వర్గానికి సంబంధించిన పోలింగ్‌ను దివాన్ చెరువు, విశాఖపట్నం, అమలాపురం, గుంటూరులోని ఆర్యాపురం బ్యాంక్ శాఖల్లో నిర్వహిస్తామన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ

- ప్రయాణికురాలికి పోగొట్టుకున్న బ్యాగ్ అందజేత
- అభినందించిన డీఎస్పీ


ప్రయాణికురాలు శిరీషకు బ్యాగ్ అందజేస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాస్

కంబాలచెరువు/ధవళేశ్వరం: ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. ప్రయాణికురాలు మర్చిపోయిన విలువైన వస్తువులున్న బ్యాగ్‌ను తిరిగి అందజేశాడు. వివరాల్లోకి వెళితే.. రాజమహేంద్రవరానికి బ్యాంకు ఉద్యోగిని కేఎల్ శిరీష ఈ నెల 12న తాడేపల్లిగూడెం నుంచి వైజాగ్ వెళ్లేందుకు రైలు ఎక్కింది. అయితే ఆమె భర్త రాజమహేంద్రవరం బస్టాండ్‌లో ఉండడంతో అతడి వద్దకు వెళ్లేందుకు రాజమహేంద్రవరంలో రైలు దిగిపోయింది. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు ధవళేశ్వరానికి చెందిన కురందాసు శ్రీనివాస్ ఆటోలో వెళ్లింది. అక్కడ తన తన బ్యాగ్‌లను కిందకి దింపుకొని వెళ్లింది. బస్టాండ్ లోపలకు వెళ్లి చూసుకునే సరికి ఇంకో బ్యాగ్ కనిపించలేదు. దానిని ఆటోలో మర్చిపోయినట్లు గమనించి వెంటనే బయటకు వచ్చి చూడగా ఆటో వెళ్లిపోయింది. దీనిపై ప్రకాశం నగర్‌లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆ సమాచారాన్ని వాట్సాప్ గ్రూపులలో మెసేజ్ చేశారు. ఆ మెసేజ్ డ్రైవర్ శ్రీనివాస్‌కు రావడంతో దాన్ని చూసి వెంటనే తన ఆటోలో బ్యాగ్‌ను గుర్తించాడు. ఈ విషయాన్ని యూనియన్ నాయకుడు గాలి రాధాకృష్ణకు తెలిపాడు. అనంతరం ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి బ్యాగ్ సంగతి వివరించారు. దీంతో ఎస్సై క్రాంతి కుమార్ ప్రకాశం నగర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

బ్యాగ్‌లో దుస్తులతో పాటు బంగారు మంగళ సూత్రం గొలుసు, మూడు చైనులు చైను, నాలుగు బంగారు గాజులు, నల్లపూసల తాడు, ఉంగరం ఉన్నాయి. ఆ బ్యాగ్‌ను డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ సమక్షంలో శనివారం ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌లో శిరీషకు అందజేశారు. నిజాయితీగా బ్యాగ్ అందించిన ఆటోడ్రైవర్ కురందాసు శ్రీనివాస్‌ను ఎస్పీ పి.జగదీష్, డీఎస్పీ అంబికా ప్రసాద్, పోలీసులు అభినందించారు. కాగా.. నిజాయితీగా వ్యవహరించిన ఆటోడ్రైవర్ శ్రీనివాస్‌కు శిరీష రూ.5 వేలు బహుమతిగా అందించారు.

గంజాయి కేసులున్న వారిపై ప్రత్యేక నిఘా

పెదపూడి: గంజాయి నిర్మూలనలో భాగంగా గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచామని ఎస్ఐ శోభన్‌కుమార్ తెలిపారు. శనివారం కాకినాడ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి ఆయన మండలంలోని రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు గ్రామాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎవరైనా గంజాయిని తాగినా, రవాణా చేసేందుకు యత్నించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బిక్కవోలు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కొంకుదురు పీహెచ్‌సీ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

పారిశుధ్యం మెరుగుపరచాలి

పెదపూడి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మరింత మెరుగుపరచాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం కరకుదురు, జి.మామిడాడ, పెదపూడి గ్రామాల్లో పారిశుధ్య పనులు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో డెంగీ, మలేరియా, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్రామాల్లోని మురుగు కాల్వలో సిల్ట్ తొలగించే పనులు ముమ్మరంగా చేపట్టాలని సూచించారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు బి.ప్రసన్నకుమార్, మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు షోకాజ్ నోటీసులు

కడియం: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ కె.దినేష్ కుమార్ శనివారం కడియం, రూరల్ మండలాల్లో పర్యటించి, అక్కడి వాటర్ ట్యాంకులు, సురక్షిత తాగునీటి సరఫరా తదితర విషయాలను పరిశీలించారు. కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశాలు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి కడియం ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, కడియం గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి, వేమగిరి గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి కేవీఎస్ఎస్ఎన్ రాజశేఖర్ హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి డి.రాంబాబు తెలిపారు. ఇన్‌చార్జి జేసీ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు వీటిని జారీ చేశామని, ఆ అధికారులు 24 గంటల్లోగా కలెక్టర్‌కు వ్యక్తిగతంగా హాజరై లిఖిత పూర్వకంగా తమ వివరణ తెలియజేయాలన్నారు.

మైదానాలను మెరక చేయించాలి

కడియం: పాఠశాలల్లోని లోతట్టు క్రీడా స్థలాలను మెరక చేయించాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్‌కు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఆయనను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద టీఎన్‌యూఎస్ నాయకులు కె.జయరాజు, వి.లజపతిరాయ్ తదితరులు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే ఎంపీడీవో జి.రాజ్ మనోజ్‌కు కూడా విజ్ఞప్తి చేశారు.

ఆవ పొలాల పరిశీలన


కడియం ఆవలో పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమాదేవి

కడియం: మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కడియం ఆవలోని పొలాలను తహసీల్దార్ రమాదేవి శనివారం పరిశీలించారు. ఇరిగేషన్, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి ముంపునకు అవకాశం ఉన్న ప్రదేశాలను, మురుగు కాలువల పరిస్థితిని, ముంపు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

17 నుంచి అక్కమ్మతల్లి జాతర


గురజాల అక్కమ్మతల్లి

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలోని గురజాల అక్కమ్మతల్లి జాతర ఈ నెల 17 నుంచి 21 వరకూ నిర్వహిస్తున్నట్టు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. 17వ తేదీ ఉదయం ఆరు గంటలకు పంచామృతాభిషేకాలతో కార్యక్రమాలు మొదలవుతాయన్నారు. సాయంత్రం 5 గంటలకు 108 ఘటాలతో ఊరేగింపు, 18న ఉదయం పూజలు, చల్లఘటం ఊరేగింపు, 19న కుంకుమ పూజలు, 20న లక్ష పసుపు కొమ్ములతో లక్ష్మీపూజ, 21 ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనం, మధ్యాహ్నం నుంచి అమ్మవారి ఊరేగింపు జరుగుతాయన్నారు.